'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

• కలెక్టర్ బదావత్ సంతోష్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్‌సంతోష్

నస్పూర్, మార్చి 14 : జిల్లాలో ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 9,637 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 52 మంది ముఖ్య పర్యవేక్షకులు, 52 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 4 మంది సంరక్షకులు, 545 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచుతామని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు సమయానుకూలంగా నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, ఏసీపీ ప్రకాశ్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈవోలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశం తెలిసి ఉండాలి

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియామవళి, పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలను ఎన్నికల అధికారులు పూర్తిగా తెలుసుకుని ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, ఎల్ఏఆర్అండ్ఆర్ ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళతో కలిసి సెక్టార్ అధికారులు సెక్టార్ పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సెక్టార్ అధికారి పరిధిలో కనీసం నుంచి గరిష్టంగా 12 పోలింగ్ కేంద్రాలు ఉంటాయని, ఆయా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంపు, నీడ, మూత్రశాలలు, కనీస మౌలిక సదుపాయాలు పరిశీలించి ఏమైనా అవసరం ఉన్నట్లయితే సంబంధిత సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు దృష్టికి తీసుకువెళ్లి సమకూర్చాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర సంబంధిత పరికరాల పంపిణీ సమయంలో పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయించిన ప్రకారం వాటి వివరాలను పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల రోస్టర్ పాయింట్ ను తగ్గించాలి

వినతి పత్రం సంఘం నాయకులు

రామకృష్ణాపూర్ మార్చి 14: దివ్యాంగుల రోస్టర్ పాయింట్‌ను 56 స్థానంలో కేటాయించడం అన్యాయం జరుగుతుందని, రోస్టర్ పాయింట్‌ను 10కి తగ్గించి, న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని దివ్యాంగుల సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర రావు, నాయకులు దురుశెట్టి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణకు కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు కాలువ తవ్వకం

నెన్నెల, మార్చి14: మండలంలోని మైలారం గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా వాగులో నీటి కాలువ తవ్వించారు. గ్రామస్తులు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకుపోగా ఆయన వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వాగులో నీటి ప్రవాహం తగ్గి మోటర్‌కు నీళ్లు అందడంలేదు. దీంతో గ్రామంలోనీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక మండల నాయకులు హరీశ్‌గౌడ్ జేసీబీ ద్వారా వాగులో ఊట నీటిని కాలువ ద్వారా సరఫరా అయ్యేలా తవ్వించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజా గౌడ్, కాసం లక్ష్మణ్, రమేశ్, కొమ్ము హరీశ్, భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి చేయూత

తాండూర్, మార్చి 14 : కలిసి చదువుకున్న తోటి మిత్రుడు కంటి సమస్యలతో బాధపడుతుండగా తోటి స్నేహితులు అతడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. మాదారం టౌన్‌షిప్ సింగరేణి హైస్కూల్ 1989–1990 బ్యాచ్‌కు చెందిన మిత్రులందరూ కలిసి తమతో చదువుకున్న మిత్రుడైన అన్నం దాసరి చంద్రయ్య కంటి చూపు ఆపరేషన్ కోసం రూ.16 వేలు జమచేసి అందజేశారు. ఈ సందర్భంగా మిత్ర బృందాన్ని గ్రామస్తులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ

జన్నారం, మార్చి 14 : జన్నారం ఎఫ్ఆర్వోగా కే లక్ష్మీనారాయణ తిరిగి విధుల్లో చేరారు. గతేడాది లాంగ్ లీవ్‌పై వెళ్లారు. తిరిగి బుధవారం సాయంత్రం విధుల్లో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేంజ్ పరిధిలోని అడవుల్లో ఎలాంటి అగ్ని ప్రమాదాలు, జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటుగా వన్యప్రాణులకు ఆహారం, నీటివసతి కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు.

ముళ్ల పొదల తొలగింపు

హాజీపూర్, మార్చి 14 : మండలంలోని ముల్కల్ల గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద జాతీయ రహదారి 63కు ఇరువైపులా రోడ్డు పైకి వచ్చిన ముళ్ల పొదలను గురువారం హాజీపూర్ ఎస్ఐ సురేశ్ బ్లేడ్ ట్రాక్టర్ తొలగింపు పనులు చేయించారు. కొద్ది రోజులుగా పడుతున్న ఇబ్బందులు తొలిగాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ

సీసీసీ నస్పూర్, మార్చి 14: ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కొంకటి రవీందర్, నియోజకవర్గం ఇన్‌చార్జి తిప్పారపు రమేశ్ ఆధ్వర్యంలో గురువారం నస్పూర్ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాంపెల్లి తిరుపతి, ఉపాధ్యక్షుడిగా తిప్పారపు శ్రీనివాస్, కార్యదర్శిగా అంబాల మొండయ్య, సహాయ కార్యదర్శిగా కొలుగురి నర్సయ్య, కోశాధికారిగా కొలుగురి శంకర్, కార్యవర్గ సభ్యులుగా దొమ్మటి ఓదేలు, తిప్పారపు రాములు, బొజ్జపెల్లి సారయ్య, అంతడుపుల సతీశ్, బోనాసి వీరస్వామి, ముల్కల్ల శ్రీకాంత్, దొమ్మటి రాజేందర్, కన్నూరి రాజేందర్‌ను ఎన్నుకున్నారు.

గృహజ్యోతికి దరఖాస్తులు

వేమనపల్లి,మార్చి 14 : గృహజ్యోతి పథకానికి దరఖాస్తులు చేసుకున్నప్పటికీ మంజూరు కాని అర్హులైన లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు వెంటనే పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ కమిషనర్ సభ్యురాలు

జన్నారం, మార్చి 14 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాల, పరిసరాలు, రికార్డులనుప పరిశీలించి పలు సూచనలు చేశారు. బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో చిరంజీవి, డీటీడీవో గంగారాం, హెచ్ఎం వెంకటేశ్వర్లు, వార్డెన్ అనసూయ, రామస్వామి, అత్రం జంగు, పెందుర్ లక్ష్మణ్‌రావ్ ఉన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

పోస్టర్లు విడుదల చేస్తున్న రీజినల్ కో ఆర్డినేటర్ స్వరూపారాణి

మంచిర్యాల అర్బన్, మార్చి 14: తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష టీజీఆర్‌డీసీ సెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ కే స్వరూపారాణి విడుదల చేశారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వచ్చే నెల 12వ తేదీ లోపు దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. ఏప్రిల్ 28న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలనుకునే వారు అందుబాటులో ఉన్న కోర్సులు బీఏ(హెచ్ఈపీ), బీకాం(జనరల్), బీకాం(కంప్యూటర్స్), బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ(బీజడ్సీ), బీఎస్సీ(ఎంబీజడ్సీ), బీఎస్సీ(డాటా సైన్స్)కు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సుమతి తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు(గ్రామీణ), రూ.2లక్షలు(పట్టణ) లోపు ఉండాలన్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్ గాని, 7995010674 ఫోన్ నంబర్‌లో గాని సంప్రదించాలని సూచించారు.

క్యాంపు కార్యాలయం ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూర్, మార్చి 14: చెన్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత క్యాంపు కార్యాలయానికి కొన్ని వాస్తు మార్పులు చేస్తూ మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ దంపతులు ప్రత్యేక పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాంపు కార్యాలయంలో తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని, సమస్యలను దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు.

బియ్యం అక్రమ రవాణాతో సంబంధం లేదు..

బియ్యం అక్రమ రవాణాతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఇటీవల విలేకరిపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. నియోజకవర్గంలో బియ్యం, ఇసుక, భూ అక్రమ దందాల్లో పాల్గొనే వారు ఎంత పెద్ద వారైనా వదిలిపెట్టకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్రమ దందాల్లో ఎవరైనా తన పేరు వాడుకుంటే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మందమర్రి రూరల్,మార్చి 14: మందమర్రి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు గురువారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.2.21 కోట్లతో పాత బస్టాండ్ ఏరియాలో డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నామని, పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు పని చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, గడ్డం వంశీ, మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

• డీపీవో వెంకటేశ్వర్ రావు

కోటపల్లి, మార్చి 14 : గ్రామాలకు శుభ్రంగా ఉంచాలని డీపీవో వెంకటేశ్వర్ రావు సూచించారు. కోటపల్లి మండలంలోని సర్వాయిపేట, ఎసన్వాయి, సిర్సా గ్రామాల్లో పర్యటించారు. గ్రామ పంచాయతీ రికార్డులు, పారిశుధ్య పనులు, తాగు నీటి సరఫరా, మొక్కలను పరిశీలించి పలు సూచించారు. డీపీవో వెంట ఎంపీవో అక్తర్ మొహియొద్దీన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రైవేట్ వైద్యులకు చట్టాలపై అవగాహన ఉండాలి

• ఎంహెచ్‌వో సుబ్బా రాయుడు

మంచిర్యాల ఏసీసీ, మార్చి 14: జిల్లాలోని ప్రైవేట్ వైద్యులకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ భవనంలో ప్రైవేట్ వైద్యులతో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డా.రమణతో కలిసి హాజరై మాట్లాడారు. హాస్పిటల్ నిర్వహణపై అన్ని రకాల అనుమతులు కలిగిఉండాలన్నారు. తీసుకుంటున్న చార్జీలు, వైద్య సేవలను వివరిస్తూ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పారామెడికల్ సిబ్బందిని నియమించుకోవాలన్నారు.

అంగన్ వాడీ టీచర్‌కు ఉమెన్ అచీవర్స్ అవార్డు

అవార్డు అందుకుంటున్న అంగన్ వాడీ టీచర్

మంచిర్యాల అర్బన్, మార్చి 14 : జిల్లా కేంద్రంలోని ఏసీసీ–3 అంగన్ వాడీ కేంద్రం టీచర్ ఎన్ పద్మకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ పురస్కారం ప్రదానం చేసింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పద్మకు వుమెన్ అచీవర్స్ 2024 అవార్డును రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డైరెక్టర్ క్రాంతి వెస్లీల చేతుల మీదుగా ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న పద్మను జిల్లా ఐసీడీఎస్ అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

ఐఎన్టీఎస్వోలో విద్యార్థుల ప్రతిభ

బహుమతులు సాధించిన విద్యార్థులు

మంచిర్యాల అర్బన్, మార్చి 14: ఐఎన్టీఎస్‌వో తుది ఫలితాల్లో మంచిర్యాల శ్రీచైతన్య పాఠశాల లక్ష్మీనగర్ బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాల నుంచి ఈ పరీక్షకు 95 మంది విద్యార్థులు హాజరుకాగా, 3వ తరగతి నుంచి సెగ్గం రుత్విక 2వ ర్యాంకుతో బంగారు పతకం సాధించింది. 7వ తరగతికి చెందిన గౌరిశెట్టి అశ్విత, 4వ తరగతి విద్యార్థి దుర్కి అవినాశ్ 4, 5 ర్యాంకులతో బంగారు పతకాలు సాధించారు. ముగ్గురు విద్యార్థులు ప్రత్యేక బహుమతులు, 31 మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆయూబ్ తెలిపారు. ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాజు, కోఆర్డినేటర్ కోటేశ్వర్‌రావు, జయశ్రీ అభినందించారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ

కాసిపేట, మార్చి 14 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఐశ్వర్య టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటింది. భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన పదో తరగతి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనభరిచి ఐశ్వర్య బహుమతి సాధించింది. ఈ మేరకు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఐశ్వర్యకు ఆర్గనైజర్ దాగం శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, జ్యోతి, అర్చన, పల్లె కృష్ణగోపాల్ రావు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి

మంచిర్యాలటౌన్, మార్చి 14: సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పాటును అందించాలని మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ప్రజలను కోరారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని 26,834 భవనాలనుంచి ప్రస్తుత ఏడాదిపన్నుతో పాటు పాత బకాయిలు కలుపుకుని మొత్తం 18.03 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉండగా అందులో నుంచి ఇప్పటివరకు రూ. 9.40 కోట్లు వసూలయ్యాయని, ఇంకా రూ. 8.62కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. మున్సిపల్ దుకాణాల అద్దెలు రూ. 2.11 కోట్లు రావాల్సి ఉందని అన్నారు.వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని, 2400 మంది వ్యాపారుల నుంచి రూ. 73 లక్షలు ట్రేడ్ లైసెన్స్ ఫీజు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 23 లక్షలే వసూలైనట్లు తెలిపారు. 13,200 నల్లా కనెక్షన్‌లు ఉండగా వీటి నల్లా బిల్లులు రూ. కోటి 49 లక్షలు రావాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాండూర్‌లో స్పెషల్ డ్రైవ్

తాండూర్, మార్చి 14 : ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని తాండూర్ గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో పీ శ్రీనివాస్ అన్నారు. తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం వసూలు సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి ఇంటి (ఆస్తి) పన్ను వసూలు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఎంపీడీవో పర్యవేక్షించారు. ప్రభుత్వం ఇంటి పన్ను వసూలు ఈ నెల మార్చి 15 వరకు వంద శాతం పూర్తి చేయాలని కటఆఫ్ డేట్ విధించిందని తెలిపారు. ఇంటి పన్నులు చెల్లించని వారికి గ్రామ పంచాయతీ నుంచి అందే సేవలు నిలిపివేస్తామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తపాస్ కుమార్, గ్రామ పంచాయతీ వసూలు సిబ్బంది వంశీ, మధు ఉన్నారు.

గణితం వస్తే అన్నీ సులభం

• డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా

విద్యార్థికి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా

లక్సెట్టిపేట, మార్చి 14: గణితం వస్తే మిగిలిన సబ్జెక్టు మొత్తం సులభంగా నేర్చుకోవచ్చునని లక్సెట్టిపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా అన్నారు. గురువారం ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్‌డేను నిర్వహించారు. లెక్కలు రానివారు లెక్కకు రాని వారిగా సామెత ఉన్నదన్నారు. ప్రతి విద్యార్థీ గణితంపై పట్టు సాధించి ఉన్నత ఉద్యోగాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సవిత, కుమారస్వామి, మంజుల, సంధ్యారాణి, స్వప్న, రాజేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

భీమారం, మార్చి 14 : పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీ. విక్రమ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. పదో తరగతి చదువుతున్న 77 మందికి పరీక్ష ప్యాడ్‌లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షారిక్ అహ్మద్, జీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలపై అవగాహన

కాసిపేట, మార్చి 14 : కాసిపేట మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణుడు మద్దనేని అర్జున్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, సలహాదారుడు మద్దినేని చిన్న భీమయ్య, హెచ్ఎం రాథోడ్ రమేశ్, ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, అంజత్ పాషా, రాజేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్యాడ్లు, పెన్నులు అందజేత

కాసిపేట, మార్చి 14 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రవీణ్ నాయక్, అర్చన, ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, పల్లె కృష్ణ గోపాల్‌రావు, జ్యోతి, మాధవీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్త పరీక్షలు

తాండూర్, మార్చి 14: తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో ఉచిత రక్త, మూత్ర నమూనాల పరీక్షల ల్యాబ్‌ను ఏర్పాటుచేసి పరీక్షలు నిర్వహించారు. సీఎస్సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో సుమారు 40 మంది కార్మికులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా తాండూర్ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడూ లేబర్ కార్డుతో వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సిరంగి శంకర్, నాయకులు ఎండీ ఈసా, కార్యదర్శి తపాస్‌కుమార్, సీఎస్సీ హెల్త్ కేర్ క్యాంపు సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి

• రామగుండం సీపీ ఎం శ్రీనివాస్
• పలు పోలీస్ స్టేషన్ల తనిఖీ


కాసిపేట : అధికారులకు సూచనలిస్తున్న సీపీ శ్రీనివాస్

కాసిపేట, మార్చి 14 : పోలీస్ సిబ్బంది విధుల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని రామగుండం కమిషనర్ ఎం శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం కాసిపేట పోలీస్ స్టేషన్‌ను రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

బెల్లంపల్లి పోలీస్ సబ్ డివిజన్‌లో..

బెల్లంపల్లిరూరల్, మార్చి 14: బెల్లంపల్లి పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని బెల్లంపల్లిటూటౌన్, బెల్లంపల్లివన్‌టౌన్, తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్లతో పాటు ఏసీపీ, బెల్లంపల్లిరూరల్ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ సందర్శించారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో సీపీకి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బెల్లంపల్లి సబ్‌డివిజన్‌లో పోలీసులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. గంజాయి, లిక్కర్, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సరిహద్దుల్లో నిఘా ఉంచినట్లు తెలిపారు. అనంతరం బెల్లంపల్లి ఏఆర్ హెడ్ క్వార్టర్‌ను సందర్శించారు. సీపీ వెంట బెల్లంపల్లి ఏసీపీ ఏ రవికుమార్, సీఐలు దేవయ్య, అఫ్జలొద్దీన్, ఎస్ఐలు రమేశ్, నరేశ్ ఉన్నారు.

మందమర్రిలో..

మందమర్రి రూరల్, మార్చి14: మందమర్రి పట్టణ పోలీస్ స్టేషన్‌ను సీపీ శ్రీనివాస్ సందర్శించారు. ఆయనకు బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, సీఐ కే.శశిధర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు నాకబంది, బాంబ్ డిస్పోజల్ సిబ్బందితో కల్వర్టుల తనిఖీలను ముమ్మరం చేయాలని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 53 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం చెన్నూరు పాత్రికేయుడు వెంకటేశ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సీపీకి వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశం లో పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

• ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్

సీసీసీ నస్పూర్, మార్చి 14: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ–3గని పిట్ కార్యదర్శి పెట్టం శ్రీ నివాస్, రిక్కుల గోపాల్‌రెడ్డి, తదితర నాయకులు గురువారం జనక్ ప్రసాద్‌ను కలిసి సన్మానించారు. శ్రీరాంపూర్ ఏరియాలో సమస్యలతో పాటు ఎస్ఆర్పీ–3గని ఉద్యోగుల సమస్యలను వివరించారు. యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని జనక్‌ప్రసాద్‌కు ఆయన హామీ ఇచ్చారు. జనక్‌ప్రసాద్‌ను కలిసిన వారిలో భీంరావు, కలవేన శ్యాం, గరిగె స్వామి, వీరమల్లు, కుమారస్వామి, మహేందర్‌రెడ్డి, నాగిరెడ్డి రాజిరెడ్డి, కల్లూరి శరత్, తిరుపతి, చందు, తదితరులు పాల్గొన్నారు.

రెఫర్ చేసినా డబ్బులు అడుగుతున్నారు

• కార్పొరేట్ దవాఖాన తీరుపై కార్మికుడి ఆవేదన

చికిత్స పొందుతున్న కార్మికుడు పోషయ్య

బెల్లంపల్లి, మార్చి 14 : కార్పొరేట్ దవాఖానకు సింగరేణి యాజమాన్యం రెఫర్ చేసినా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని కార్మికుడు వాపోయాడు. మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న దాసరి పోషయ్య దొనబండ గ్రామం నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 11న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. రామకృష్ణాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి హైదరాబాద్ కేర్ దవాఖానకు రెఫర్ చేశారు. అక్కడ వైద్యులు కాలర్‌బోన్‌కు ఆపరేషన్ చేయాలని తెలిపారు. ఆపరేషన్ నిమిత్తం సింగరేణి యాజమాన్యం రూ.2,30,000లతో ఉత్తర్వులు జారీచేసింది. ఇదిలా ఉంటే ఆపరేషన్‌కు అదనంగా రూ.50వేలు చెల్లిస్తే ఆపరేషన్ చేస్తామని దవాఖాన యాజమాన్యం తెలిపిందని కార్మికుడి తెలిపారు. ఆపరేషన్‌కయ్యే మొత్తం ఖర్చులు సింగరేణి యాజమాన్యమే భరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

వేసవిలో కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

సీసీసీ నస్పూర్, మార్చి 14: ఎండాకాలంలో కార్మికుల రక్షణకు సింగరేణి యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి అన్‌రెడ్డి సమ్మిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీ, సీహెచ్‌పీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగా, నిమ్మరసం, చల్లని తాగునీరు, తెలుపు టవల్స్ అందించాలని కోరారు. పని స్థలాల వద్ద చలువ పందిళ్లు, గదుల్లో కూలర్స్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ కార్మికుల డ్యూటీ టైం మార్చాలి

రామకృష్ణాపూర్, మార్చి 14: రామకృష్ణాపూర్ సివిల్ ఆఫీస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికుల డ్యూటీ టైం ను వేసవి కాలం ఎండలను దృష్టిలో పెట్టుకొని మార్చాలని ఎస్‌సీసీ డబ్ల్యూ –ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో డీవై ఎస్.ఈ (సివిల్) శ్రీధర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ. బ్రహ్మానందం, గజ్జి మల్లేశ్, కందుల వెంకటేశ్, మహేశ్, సాయి కిరణ్, రాణి, సునీత, శారద తదితరులున్నారు.

రామగుండం సీపీని కలిసిన జీఎం

మందమర్రి రూరల్, మార్చి 14: మందమర్రి పోలీస్ స్టేషన్‌కు రామగుండం సీపీ శ్రీనివాస్‌ను సింగరేణి మందమరి ఏరియా జీఎం మనోహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఎస్వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, సీఐ శశిధర్ రెడ్డి, మందమర్రి ఎస్ఐ ఎస్ రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, పోలీసు సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మంచిర్యాల అర్బన్, మార్చి 14 : పౌరసరఫరాల సంస్థలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ గెడం గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు జీ రాజశేఖర్, సభ్యులు రాజు, గంగాధర్, చంద్రశేఖర్, భూమేశ్, సాయి తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

కన్నెపల్లి, మార్చి 14 : కన్నెపల్లిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కాంగ్రెస్‌నాయకులు రామాంజనేయులు, శ్రీనివాస్, సాయికృష్ణ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాసిపేట, మార్చి 14 : కాసిపేట మండలంలోని లంబాడీతండా(ఎస్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలను నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నెన్నెల లచ్చయ్య, ఉపాధ్యాయులు చిందం చిన్నయ్య, తనుగు నాగేశ్వర్‌రావు, వడ్డీ శంకర్‌రావు, ఉమారాణి, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో.. కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య అధ్యక్షతన పదో తరగతి ఫేర్వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ లే అవుట్ వెంచర్లకు అనుమతివ్వాలి

కాసిపేట, మార్చి 14 : గ్రామ పంచాయతీ లే అవుట్ వెంచర్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రియల్టర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కర్ల శ్రీధర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని వెంచర్లకు డీటీసీపీ లే అవుట్ ఏర్పాటు చేస్తే అవి మధ్య తరగతి ప్రజలకు ధరలు అందుబాటులో ఉండవని, కొనుగోలు చేయలేరని, వెంటనే పంచాయతీ లే అవుట్‌కు అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు.

శ్రీరాంపూర్ సీఐగా మోహన్

సీసీసీ నస్పూర్, మార్చి 14 : శ్రీరాంపూర్ సీఐగా మోహన్ నియామితులయ్యారు. ఈ మేరకు పోలీస్ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీరాంపూర్‌లో సీఐగా పని చేసిన బన్సిలాల్ మంచిర్యాల పట్టణ సీఐగా బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో ఖానాపూర్‌లో సీఐగా పనిచేసిన మోహన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. గురువారం శ్రీరాంపూర్ సర్కిల్ కార్యాలయంలో మోహన్ బాధ్యతలు స్వీకరించారు.